
◈ ఈ వారం కథ

# ఖాతాసరి చూడబడినది




– ప్రశాంతి

కొన్ని సమస్యలు చిత్రంగా ఎప్పటికీ కొత్తగానే వుంటాయి– ఏ పూట కాపూట ఆకలికి మల్లే! వరదల వల్ల జరిగిన ఆస్తి నష్టం, ప్రాణ నష్టాల గురించిన వివరాలు ఇవ్వడంలో పత్రికలు పోటీపడ్డాయి. రాజకీయ నాయకులు ఎప్పట్లాగే తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు. హెలికాప్టర్ సర్వేలు జరిగాయి. యుద్ధ ప్రాతిపదికపై సహాయ, పునరావాస కార్యక్రమాలు మొదలయ్యాయి.

పోయినసారి వరదలు వచ్చినప్పటి దృశ్యాలు నాకింకా కళ్ళ ముందే కదులుతున్నాయి. అప్పుడూ ఇవే దృశ్యాలు, ఇవే సంపాదకీయాలు, ఇవే సర్వేలు – అప్పుడే గనక ప్రభుత్వం చిత్తశుద్ధితో వరద నిర్మూలనకు శాశ్వత పరిష్కారానికి కృషి చేసి వుంటే మళ్ళీ ఇంత పెద్ద ఎత్తున నష్టం జరిగేది కాదు. కానీ ఎవరికి పట్టింది? వరద ప్రభావం తగ్గుముఖం పట్టగానే విషయం తెరమరుగున పడిపోతుంది. మళ్ళీ ప్రముఖుల నిత్యావసరాలయిన కులం కుమ్ములాటలు, అధికార లాలస ల పైనే అందరి దృష్టి– నాయకులది కానివ్వండీ– పత్రికలది కానివ్వండీ– ఎవరి దాకానో ఎందుకు? నా విషయమే తీసుకోండి. పోయినసారి అందరితో పాటు నేనూ ఈ సంపాదకీయాలు చదివిన వాడినే. సిగరెట్టు పొగతో బాటు అందులోని విషయాలనూ గాలికి వదిలేసినవాడినే! మరి ఇప్పుడెందుకింత పట్టించుకుంటున్నానని అడుగుతున్నారా? మీరు అలా అడుగుతారని నాకు తెలుసు. నేను ఇప్పుడెందుకింతగా పట్టించుకుంటున్నానంటే ప్రస్తుతం నేను రాఘవరావు దగ్గర అకౌంటెంట్‌గా పని చేస్తున్నాను గనుక.

***

రెండేళ్ళ క్రితం దాకా నేనొక పేరున్న ప్రైవేట్ కంపెనీలో అకౌంటెంట్‌గా పనిచేశాను. చిన్నప్పటి నుంచీ చేసే పని పట్ల అంకితభావం వున్నవాణ్ణి కావడంతో నా పనిని చివరిదాకా శ్రద్ధాసక్తులతో నిర్వర్తించాను. రిటైర్‌మెంట్ రోజు మా ప్రొప్రయిటర్ నాకు ఓ పూలమాల వేసి, శాలువా కప్పి నా నిజాయితీని గూర్చి ఆకాశానికి ఎత్తేసి మాట్లాడినప్పుడు నాకెంతో సంతోషం వేసింది.

ప్రైవేట్ కంపెనీ కావడంతో గ్రాట్యుటీ తదితర ఫైనాన్షియల్ బెనిఫిట్స్ తప్ప పెన్షన్ గట్రా ఏమీ లేదు. ●న్న డబ్బు బొటాబొటిగా అమ్మాయి పెళ్ళికి, అబ్బాయికి చిన్న వ్యాపారం పెట్టించడానికి సరిపోయింది. అందువల్ల నేను మళ్ళీ ఉద్యోగం చేయడం తప్పలేదు. అది పెద్ద కష్టమని కూడా నేనేమీ భావించలేదు. వృధాగా కాలం వెళ్ళబుచ్చడం కన్నా అదే మంచిదనిపించింది. నా పరిస్థితి తెలిసిన కంపెనీ ప్రొప్రయిటర్ గారు రాఘవరావు దగ్గర ఉద్యోగం ఇప్పించారు. ఇక్కడ రాఘవరావు గురించి కొంత చెప్పాలి.

రాఘవరావు వయస్సు నలభై రెండు ఏళ్ళు. స్ఫురద్రూపి. పెద్ద ఎత్తున వాణిజ్య పంటలతో వ్యవసాయం చేస్తూ వచ్చిన డబ్బుని వ్యాపారంలోనూ, రాజకీయాల్లోనూ పెట్టుబడి పెడుతూ మంచి పలుకుబడిని సంపాదించాడు. ప్రత్యేకంగా ఏ వర్గానికీ చెందినవాడుగా ముద్రపడకపోవటంతో అన్ని వర్గాలతోనూ అత



# సి.నా.రె ఛలోక్తులు



తూర్పు గోదావరి జిల్లా 'రామవరం' గ్రామంలో నల్లమిల్లి మూలా రెడ్డి కళాపరిషత్ వారు నిర్వహించిన రాష్ట్ర స్థాయి నాటికల పోటీ సందర్భంగా 24–4– '90 తేదీన జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డా. సి. నారాయణరెడ్డిగారికి సన్మానం జరిగింది. ఆ రోజు సాయంత్రం వారి ప్రసంగంలో చిన్న గ్రామమైన 'రామవరం'లో పెద్ద స్థాయిలో కళా సాహిత్య కార్యక్రమాలను నిర్వహించడాన్ని ప్రశంసిస్తూ సినారె "ఇది రామవరం గ్రామవరం" (గ్రామాలలో శ్రేష్టమైనది") అని చక్కని పద ప్రయోగం చేసి సభికుల్ని ఆనందభరితుల్ని చేశారు.

డా. టి.వి.నారాయణరెడ్డి గణపవరం

– సేకరణ: డాక్టర్ ఎన్. గోపి

నికి మంచి సంబంధాలే వున్నాయి. డబ్బు సంపాదనకు వున్న ఏ అవకాశమూ వదులు కోడు. ఇన్నీ వున్నా అతనికి ఒక్కటే చింత. ఇంత సంపాదనకూ వారసుడు ఇంతవరకూ పుట్టలేదు. ఆ విషయంగానే అటు పూజలూ, పునస్కారాలూ, ఇటు వైద్యులను సంప్రదించడాలూ జరుగుతుంటాయి ఆ ఇంట్లో.

***

రాఘవరావులో ఆనందం పరవళ్ళు తొక్కుతోంది. కర్కశ హస్తంతో ఎన్నో కుటుంబాలను నాశనం చేసిన వరద తనకు మాత్రం కనక వర్షం కురిపిస్తోంది. తన ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబడ్డ 'ఆశ్రయ వరద బాధిత సహాయక ట్రస్ట్' కు భారీ ఎత్తున విరాళాలు వచ్చాయి. విరివిగా ప్రచారం చేపట్టడంతో ప్రజల నుండి కూడా భారీ ఎత్తునే వసూలు జరిగింది. అన్ని వర్గాల రాజకీయ నాయకులు సరేసరి. ఒకళ్ళతో ఒకళ్ళు పోటీ పడి విరాళాలు ఇచ్చారు. వాళ్ళకు తెలుసు. వచ్చే ఎన్నికలలో తను ఎవరికి మద్దతు ఇస్తే వాళ్ళే గెలుస్తారు. అందువల్లే అలా పోటీపడ్డారు.

***

నిధుల సేకరణ పూర్తయ్యాక రాఘవరావు నన్ను పిలిచాడు. వాటి జమా ఖర్చులు రాయాల్సింది నేనే కదా మరి!! దాదాపుకోటిన్నర దాకా పోగయ్యింది. నన్ను పిలిపించిన తర్వాత రాఘవరావు ఆ గదిలో వున్న మిగతా వాళ్ళందర్నీ బయటకు పంపేశాడు. గదిలో ఇద్దరమే మిగిలాం!

అతడు చెప్పిన విషయాలు విని నేను ఆశ్చర్యపోయాను. ఇలాంటి వ్యవహారాలు జరుగుతాయని కర్ణాకర్ణిగా వినడం తప్ప ఇంత ప్రత్యక్షంగా నా అనుభవంలోకి రావడం ఇదే మొదటి సారి. పోగయిన నిధులలో ముఖ్యమంత్రి మంచీ ఇన్‌కంటాక్స్ అధికారి దాకా వివిధ వ్యక్తులకు ఈయవలసిన వాటాలు చెప్పాడు. పోగయిన మొత్తంలో అధికశాతం ధనమే కనుక ఇచ్చినవారి వివరాలుండవు. అందరికీ అందవలసిన వాటాలు అందడం వల్ల ఎవరినుండీ ఏ ఒత్తిడీ రాదు.

ఒక్క క్షణం నా మనసు బాధతో విలవిలలాడింది. వరదల్లో సర్వం కోల్పోయినవాళ్ళు కళ్ళ ముందు మెదిలారు. కానీ నేనేం చేయగలను? లెక్కలురాయడం నా విధి.

అతడు చెప్పడం పూర్తయ్యే సరికి నేను తేరుకున్నాను. లెక్కల్లో నిపుణుణ్ణే గనక అంతా సులభంగానే జరిగిపోయింది. పోగయిన డబ్బులో ముప్పైశాతం మాత్రమే ప్రజల దాకా వెళ్ళింది. సహాయ కార్యక్రమాల ఏర్పాటులో జరిగిన ప్రచారం వల్ల రాఘవరావుకు గొప్ప ప్రజా సేవకునిగా పేరు కూడా వచ్చింది.

***

పై సంతోషం నుంచి రాఘవరావు తేరుకోక ముందే అతనికి కాలం మరో సంతోషవార్తను మోసుకొచ్చింది. పూజించిన దేవుళ్ళే కరుణించారో, డాక్టర్ల మందులే ఫలించాయో గానీ రాఘవరావు భార్య నెలతప్పింది. ఆ ఇంట్లో సంతోషానికి మేరలేదు. అంతా సవ్యంగా జరిగిపో యి పండండి కొడుకు పుడితే వేంకటేశ్వర స్వామికి గుడి కట్టిస్తానని మొక్కుకున్నాడు రాఘవరావు.

అనుకున్నట్టుగానే పండంటి కొడుకు పుట్టాడు. మొక్కు ప్రకారం గుడి కట్టించడానికి ఉపక్రమించాడు రాఘవరావు. అతడు గుడి కట్టిస్తున్నాడనే విషయం ఆంధ్ర దేశమంతా పాకింది. ఆ గుడి నిర్మాణానికి చందాలివ్వడంలో మళ్ళీ ప్రముఖులంతా పోటీ పడ్డారు. అనుకున్నవన్నీ అనుకున్నట్టు జరగడంతో రాఘవరావు భక్తి మరింత పెరిగింది. తక్కిన కార్యక్రమాలన్నీ ప్రక్కన పెట్టి గుడి నిర్మాణాన్ని స్వయంగా పర్యవేక్షిస్తున్నాడు.

పోగయిన చందాల విషయంలో అతడు చెప్పింది విని మరోసారి ఆశ్చర్యపోయాను. లెక్కల్లో ఒక్క పైసా తేడా రావడానికి వీల్లేదన్నాడు. వచ్చిన ప్రతీ పైసా ఆలయ నిర్మాణంలోకి ఖర్చు కావలసిందేనన్నాడు.

రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా? సంవత్సరం తిరిగేసరికి భవ్యమైన మందిరం తయారైంది. పిల్లవాడి మొదటి పుట్టినరోజు నాడే ఆలయంలో విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ట చేయడానికి ముహూర్తం నిర్ణయించారు.

కార్యక్రమం రంగరంగ వైభవంగా జరిగింది. పూలు, అగరబత్తులు, ఖరీదైన ప్రసాదాల వాసనల ఘుమఘుమలతో పట్టు చీరల రెపరెపలతో ఆలయ ప్రాంగణం మెరిసిపోయింది.

అంతా అదే విధంగా జరిగిపోయి వుంటే ప్రతీ రోజూ జరిగే లక్షలాది సంఘటనల్లో అదీ ఒకటిగా మిగిలిపోయేది.

రెండు గంటల వ్యవధిలో ఆ ఇంటి వాతావరణం అంతలా మారిపోతుందని ఎవరూ కలలో కూడా అనుకోలేదు. గుడి నుంచి తిరిగి వస్తున్న రాఘవరావు కారుకు ఆక్సిడెంట్ అయింది. రాఘవరావుకు, అతని భార్యకు గాయాలు పెద్దగా తగల్లేదు. బాబుకు మాత్రం తలకు బలమైన గాయం తగలడంతో శాశ్వతంగా కన్ను మూశాడు.

శోకతప్తమైన ఆ ఇంటిని చూస్తుంటే నాకు సర్వం కోల్పోయి విలపిస్తున్న వరద బాధితులు గుర్తొచ్చారు. వారి పేరుచెప్పి వసూలు చేసిన డబ్బుతో కట్టిన మందిరంలోని దేవుడు "నాకూ లంచమివ్వాలని చూశావా?" అని నవ్వుతున్నట్టు అనిపించింది. ఆ నిధులను రాఘవరావు సవ్యంగా వినియోగించి వుంటే అతనికి ఈ పరిస్థితి వచ్చేది కాదేమో అన్పించింది.

ఎప్పట్లాగానే నేను మౌనంగా నా కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూనే వున్నాను. ◆